శ్రీరంగనాథుడి సేవలో రాష్ట్రపతి

● ముగిసిన ద్రౌపది ముర్ము పర్యటన



రాజ్‌భవన్‌లో మొక్క నాటుతున్న రాష్ట్రపతి

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పర్యటన బుధవారం రాత్రితో ముగిసింది. మంగళవారం ఉదయం బెంగళూరు నుంచి చెన్నైకి ప్రత్యేక విమానంలో వచ్చిన రాష్ట్రపతి సిటీ యూనియన్ బ్యాంక్ 120వ వార్షికోత్సవంలో పాల్గొన్న విషయం తెలిసిందే. అనంతరం గిండిలోని రాజ్‌భవన్‌లో బస చేసి, బుధవారం ఉదయం ఓ మొక్కను నాటారు. అనంతరం విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో తిరుచ్చి బయలుదేరి వెళ్లారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో తిరువారూర్ వెళ్లిన రాష్ట్రపతి తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయడంతో పాటు ప్రసంగించారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తిరుచ్చి చేరుకున్న రాష్ట్రపతి.. రోడ్డుమార్గంలో శ్రీరంగం వెళ్లి.. రంగనాథ స్వామిని దర్శించుకున్నారు. రాష్ట్రపతికి ఆలయ నిర్వాహకులు, పూజారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. రాష్ట్రపతితో పాటు గవర్నర్ ఆర్ఎన్ రవి, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి గీతా జీవన్ కూడా వున్నారు. రాష్ట్రపతి పర్యటనను పురస్కరించుకుని మధ్యాహ్నం ఒంటిగంట నుంచే ఆలయంలోకి భక్తులను నిలిపేశారు. ఇదిలా వుండగా శ్రీరంగనాథుడి దర్శనానంతరం.. రోడ్డుమార్గంలో తిరుచ్చి విమానాశ్రయం చేరుకున్న రాష్ట్రపతి.. అక్కడే అల్పాహారం స్వీకరించి, రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.



శ్రీరంగ నాథుడిని దర్శించుకుని బయటకు వస్తున్న రాష్ట్రపతి

కేంద్రప్రభుత్వ పథకాలను నీరుగారుస్తున్న డీఎంకే



● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

ప్యారీస్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను డీఎంకే ప్రభుత్వం నీరుగారుస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ, దిండుగల్ జిల్లా పళని ప్రాంతంలోని ఫుట్‌పాత్ వ్యాపారులు, చిన్నా, మధ్యతరగతి కార్మికులను ఆదుకునేలా కేంద్రప్రభుత్వం పరిచయం చేసిన స్వానిధి, ముద్రా రుణాలు అందజేసేలా దిండుగల్ జిల్లా బీజేపీ కార్యదర్శి పరమేశ్వరిని స్థానిక డీఎంకే పంచాయతీ చైర్మెన్ ఉమా మహేశ్వరి అసభ్య పదజాలంతో దూషించారని, దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం చూపారని ఆరోపించారు. ప్రజలకు లబ్ధిచేకూర్చే కేంద్రప్రభుత్వ పథకాలకు ప్రజలనుండి మంచి స్పందన వస్తుండటాన్ని చూసి ఓర్వలేక డీఎంకే ప్రభుత్వం పథకాలను అడ్డుకుంటోందని, మరోవైపు కేంద్రప్రభుత్వ పథకాలకు స్టిక్కర్లు అంటించి తమ పథకాలుగా ప్రకటించుకుంటోందని విమర్శించారు. డీఎంకే-కాంగ్రెస్ కూటమిలోని పార్టీలన్నీ ఏకమై కేంద్రప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నా- ప్రధాని నరేంద్రమోదీ మాత్రం వాటిని పట్టించుకోకుండా తమిళనాడు ప్రజలకు లబ్ధిచేకూర్చే విధంగా పథకాలు అమలుచేస్తున్నారని, దీనిపై రాష్ట్ర బీజేపీ తరుపున ప్రచారం చేపట్టనున్నట్లు నయినార్ నాగేంద్రన్ తెలిపారు.


షార్జా విమానంలో సాంకేతిక లోపం - 6 -

మీనంబాక్కం నుంచి కిలాంబాక్కం వరకు మెట్రో - 6 -

ఆవణి మూల ఉత్సవాలు

అశ్వవాహనాలపై మీనాక్షి, సుందరేశ్వరుల ఊరేగింపు





చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో ఆవణి మూల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి భక్తశిఖామణి మాణిక్యవాచగర్‌ను కాపాడేందుకు స్వామి, అమ్మవారు కలిసి నక్కలను గుర్రాలుగా మార్చి తీసుకెళ్లిన లీలా వినోద ఘట్టాన్ని ప్రదర్శించారు. ఈ వేడుకలను తిలకించేందుకు తిరుప్పరంకుండ్రం నుంచి మురుగప్పెరుమాన్, తిరువాదవూరు నుండి మాణిక్యవాచగర్ వేంచేశారు. ఓ పురాణగాథను బట్టి మదురైని పాలించిన హరిమర్ధన పాండ్యన్ వద్ద మాణిక్యవాచగర్ మంత్రిగా పనిచేస్తున్నప్పుడు, సైన్యానికి కొత్త గుర్రాలను తీసుకురమ్మని, కావాలసినంత ధనాన్ని ఆయనకు ఇచ్చి తిరుపెరుందురైకి పంపుతారు. అక్కడకు వెళ్ళిన మాణిక్యవాచగర్ తనదగ్గరున్న ధనంతో గుర్రాలను కొనుగోలు చేయకుండా అక్కడ అందమైన శివాలయాన్ని నిర్మించాడు. ఈ విషయం తెలుసుకున్న రాజు మాణిక్యవాచగర్‌ను నిర్బంధించి తీసుకురమ్మని సైనికులను పంపిస్తాడు. అదే సమయంలో మాణిక్యవాచకర్ తనను కాపాడమంటూ పరమశివుడిని వేడుకుంటారు. పరమశివుడు ప్రత్యక్షమై ఆవణి మూల పర్వదినాన మేలుజాతి అశ్వాలు వచ్చి చేరుతాయని రాజుకు చెప్పమని ఆదేశిస్తారు. ఆ ప్రకారమే మాణిక్యవాచకర్ చెబుతారు. ఆవణి మూల దినాన పరమేశ్వరుడు అడవిలో సంచరిస్తున్న నక్కలన్నింటినీ గుర్రాలుగా మార్చి ఆ రాజ్యానికి పంపుతారు. ఆ గుర్రాలతోపాటు సుందరేశ్వరుడు కూడా అశ్వారూఢులై వెళతారు. ఇదంతా సుందరేశ్వరర్ స్వామివారి లీలా వినోదమని తెలుసుకున్న రాజు మాణిక్యవాచకర్ భక్తిని మెచ్చుకుని ధనకనకవస్తువులతో సత్కరిస్తారు. ఈ ఘటాన్ని మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో మంగళవారం రాత్రి ప్రదర్శించారు. స్వామి, అమ్మవార్లు సర్వాలంకరణశోభితులై అశ్వవాహనాలలో బయలుదేరే వేడుకలను నిర్వహించారు. ఈ పురాణగాథను గురించి సెంథిల్‌భట్టర్ పాండ్యరాజు వేషధారణలో భక్తులకు సోదాహరణంగా వివరించారు.

లండన్‌లో స్టాలిన్‌కు అపూర్వ స్వాగతం

● నేడు ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో పెరియార్ చిత్రపటావిష్కరణ



స్టాలిన్‌తో సెల్ఫీ తీసుకుంటున్న యువతి



చిన్నారితో కరచాలనం చేస్తున్న స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విదేశీ పెట్టుబడుల సమీకరణ కోసం జర్మన్‌లో మూడు రోజుల పర్యటన ముగించుకుని లండన్ చేరుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్‌కు అపూర్వ స్వాగతం లభించింది. జర్మన్‌లో స్టాలిన్ సమక్షంలో రెండు విడతలుగా జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో రూ.7వేల కోట్లకు పైగా పెట్టుబడుల సమీకరణతో పాటు, 26 కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కూడా కుదిరాయి. ఈ నేపథ్యంలో జర్మన్ నుంచి విమానంలో బయలుదేరిన స్టాలిన్ బుధవారం వేకువజామున లండన్ చేరుకున్నారు. విమానాశ్రయం వద్ద స్టాలిన్, ఆయన సతీమణి దుర్గాస్టాలిన్, మంత్రి టీఆర్‌బీ రాజా తదితరులకు అక్కడి తమిళ కుటుంబాలు ఘనస్వాగతం పలికాయి.. బాలబాలికలు తమిళనాడు సీఎం స్టాలిన్‌కు స్వాగతం అంటూ తమిళంలో రాసిన ప్లకార్డులతో స్వాగతం పలికారు. ఆ సందర్భంగా స్టాలిన్‌తో కరచాలనం చేయడానికి బాలబాలికలు ఉత్సాహం చూపించారు. చిన్నారులతో కరచాలనం చేసిన తర్వాత స్టాలిన్ అక్కడి తమిళ ప్రముఖులతో కాసేపు మాట్లాడి, వారి యోగక్షేమాలు గురించి అడిగి తెలుసుకున్నారు. పలువురు తమిళ పారిశ్రామికవేత్తలు స్టాలిన్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం తరువాత స్టాలిన్ దంపతులు లండన్ నగరంలోని స్టార్ హోటల్‌కు వెళ్ళి బసచేశారు. సాయంత్రం లండన్‌లోని ప్రవాస తమిళ సంఘాల ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. రాత్రి స్టార్ హోటల్‌లోనే బసచేయనున్నారు. గురువారం ఉదయం ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో జరుగనున్న సదస్సులో పాల్గొని, ద్రవిడ ఉద్యమనేత పెరియార్ చిత్రపటాన్ని ఆవిష్కరించనున్నారు. ఇంగ్లాండులో తమిళులంతా తనకు ఘనస్వాగతం పలికారని, వారి ఆదరాభిమానాలు చూసి ఆశ్చర్యపోయానని స్టాలిన్ తన ఎక్స్‌పేజీలో ఓ సందేశం వెలువరించారు.

అంతర్గత కలహాలకు చెక్ పెట్టండి

● కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయండి

● బీజేపీ నేతలకు అమిత్‌షా దిశానిర్దేశం



ప్యారీస్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు బీజేపీలో అంతర్గత కలహాలకు చెక్ పెట్టి కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాష్ట్ర బీజేపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్ర రాజకీయ పరిస్థితులను వివరించేందుకు అమిత్‌షాతో రాష్ట్ర బీజేపీ నేతలు న్యూఢిల్లీలో బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఎన్డీయే కూటమిలో ఉన్న మిత్రపక్షాల సహకారంతో మరికొన్ని పార్టీలను కలుపుకుని కూటమి బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అమిత్‌షా రాష్ట్ర నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం అన్ని పార్టీలు ఏర్పాట్లు ముమ్మరం చేయగా, అమిత్‌షా కూడా ఇప్పటికే రెండు సార్లు రాష్ట్రానికివచ్చి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, కూటమిలోని మిత్రపక్షాల నేతలతో సమావేశమై కూటమి ఖరారుచేసి వెళ్లారు. అమిత్‌షా ఇచ్చి ప్రోత్సాహంతో రాష్ట్ర బీజేపీ అన్ని జిల్లాల్లో బూత్ కమిటీలను పటిష్ఠం చేసేలా తిరునల్వేలిలో తొలి మహానాడును విజయవంతంగా నిర్వహించింది. మరోవైపు అన్నాడీఎంకే-బీజేపీ కూటమి విజయం కోసం మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి చేపట్టిన రాష్ట్రవ్యాప్త పర్యటన దాదాపు 50 శాతానికి పైగా పూర్తయ్యింది. ఈ కూటమిని ఎలాగైనా చీల్చేందుకు ఇండియా కూటమిలోని రాష్ట్రనేతలు బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఎన్నికల్లో ఓటు చోరీ జరుగుతోందంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన పోరాటాలకు అధికార డీఎంకే మద్దతు తెలియజేయడంతో పాటు ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా బిహార్‌లో జరిగిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. దీని వలన రాష్ట్రంలో బీజేపీ కూటమికి వ్యతిరేకంగా చేపడుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టడం ఎలా? కూటమిని మెజారిటీ సీట్లలో గెలిపించేందుకు వ్యవహరించాల్సిన తీరు, ఓటర్లను ఆకట్టుకునేలా సాగించాల్సిన ప్రచార యుక్తి, బూత్ కమిటీల పనితీరు.. తదితర అంశాలపై రాష్ట్ర బీజేపీ నేతలకు అమిత్‌షా మెళుకువలు నేర్పినట్లు సమాచారం. బీజేపీ నేతల్లో ఏర్పడిన అభిప్రాయభేదాలను పక్కనబెట్టి పార్టీ ఓటు బ్యాంకు పెంచే దిశగా కృషిచేయాలని బీజేపీ శ్రేణులకు ఆయన సూచనలిచ్చినట్లు తెలిసింది. అమిత్‌షా ఆహ్వానం మేరకు న్యూఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ అధ్యక్షురాలు తమిళిసై సౌందరరాజన్, సీనియర్ నాయకులు హెచ్.రాజా, కేశవ వినాయగం, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అరవింద్‌మేనన్, కో-ఇన్‌ఛార్జి డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డితో పాటు పలువురు ముఖ్య నేతలు హాజరు కాగా, అన్నామలై ఈ సమావేశంలో పాల్గొనలేదని బీజేపీ వర్గాలు తెలిపాయి.





కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఉపముఖ్యమంత్రి

ఫాసిస్ట్ శక్తుల దుష్ప్రచారం మైనార్టీ వర్గాలకు నష్టం

● ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

అడయార్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్వేష ప్రసంగాలతో సమాజంలోని మైనారిటీ వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ఆవేదన వ్యక్తం చేశారు. ట్రిప్లికేన్‌లోని కలైవానర్ అరంగంలో రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ... దేశంలోని ఫాసిస్ట్ శక్తులకు అసత్య వార్తలను ప్రచారం చేయడమే దినచర్యగా మారిపోయిందన్నారు. అసత్య వార్తలను ప్రచారం చేయడం వెనుక ఎలాంటి ఉద్దేశం ఉండదన్నారు. కానీ, ఒక అంశాన్ని మార్చి ప్రచారం చేయడం అనేది పథకం ప్రకారం చేసే తప్పుడు ప్రచారం అని పేర్కొన్నారు. ఈ తరహా ప్రచారం చాలా ప్రమాదకరమైనదన్నారు. మరో రెండేళ్ళలో ఈ రెండు అంశాలు ప్రపంచానికి పెను ప్రమాదంగా మారతాయన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో పశు మాంసం తినేవారిని పొడిచి చంపేస్తున్నారనే వార్తను ప్రచారం చేశారన్నారు. అలాగే, మన రాష్ట్రంలోని ఉత్తరాది వారిపై దాడులు జరుగుతున్నాయనే ప్రచారం చేశారన్నారు. ఈ అంశంపై ఉత్తరాదికి చెందిన ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్రానికి ఆహ్వానించి వాస్తవ పరిస్థితి వివరించారన్నారు. పుట్టుకతో ఎవరూ ఉన్నత, అధమ వర్గాలకు చెందిన వారు కాదని మూడేళ్ళ క్రితం తాను వ్యాఖ్యానించారన్నారు. పుట్టుకలో ఎలాంటి హెచ్చుతగ్గులు లేవని పేర్కొన్నానని, అలాంటిది ఒకటి ఉంటే దాన్నివెంటనే నిర్మూలించాలని తాను మాట్లాడానని గుర్తు చేశారు. దీన్ని కూడా కొందరు వక్రీకరించి అసత్య ప్రచారం చేశారన్నారు. తాను చేసిన ప్రసంగాన్ని మార్చి దేశవ్యాప్తంగా విష ప్రచారం చేశారన్నారు. ఈ వివాదంలో తన తలను తెగ నరికే వారికి రూ.10 లక్షల రివార్డు కూడా ఇస్తామని ప్రకటించారన్నారు. మరో స్వామీజీ పోటాపోటీగా ఉదయనిధి తలను నరికేసే వారికి రూ.కోటి రివార్డు ఇస్తామని ప్రకటించారన్నారు. ఆ వెంటనే క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారన్నారు. ఈ విషయంలో తాను ఏమాత్రం వెనక్కి తగ్గకపోగా కోర్టు మెట్లెక్కేందుకు కూడా సిద్ధపడ్డానని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రచారమయ్యే వదంతులపై విద్యార్థులు, యువకులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు వాస్తవాలు వివరించాలని డిప్యూటీ సీఎం ఉదయనిధి పిలుపునిచ్చారు.

మేయర్ భర్త అరెస్టు కపట నాటకం

● మదురై రోడ్‌షోలో విమర్శించిన ఎడప్పాడి



ప్యారీస్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మదురై కార్పొరేషన్ పన్ను వసూళ్లలో అవినీతికి పాల్పడిన వ్యవహారంలో మేయర్ భర్తను అరెస్టు చేయడం డీఎంకే ఆడిన కపట నాటకమని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని అన్నాడీఎంకే ఆధ్వర్యంలో జూలై 7న కోవై జిల్లా మేట్టుపాళయంలో 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో ఈపీఎస్ ప్రచారయాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ యాత్రలో భాగంగా బుధవారం మదురై నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో ఈపీఎస్ మాట్లాడారు. అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రంలో ఉన్న కార్పొరేషన్, మున్సిపాలిటీ, టౌన్ పంచాయతీలు, గ్రామ పంచాయతీల్లో అవినీతికి చోటులేకుండా పారదర్శకంగా అన్ని సేవలను ప్రజలు అందుకున్నారని తెలిపారు. 2021లో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం ఇవ్వకుండా ఏ పని జరగని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. మదురై కార్పొరేషన్‌లో డీఎంకేకి చెందిన మేయర్ రూ.200 కోట్ల మేర అవినీతి కేసుల్లో చిక్కుకున్నారని, అవినీతికి పాల్పడిన మేయర్‌ను అరెస్టు చేయకుండా ఆమె భర్తను పోలీసులు అరెస్టు చేయడం ఎంతవరకూ న్యాయమని, ఈ కపట నాటకాన్ని మదురై నగరప్రజలు గమనిస్తూనే ఉన్నారని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో దీనికి తగిన గుణపాఠం చెబుతారని ఈపీఎస్ పేర్కొన్నారు.

రూ.98 కోట్ల కాంట్రాక్టుల్లో అవినీతి కేసు

● అదనపు ఛార్జిషీట్‌లో ఎస్పీ వేలుమణి పేరు



చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రభుత్వంలో చెన్నై, కోయంబత్తూరు కార్పొరేషన్లలో పలు పనులకు సంబంధించి రూ.98.25 కోట్లకు పైగా జరిగిన అవినీతి కేసులో మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి పేరు చేర్చినట్లు కోర్టుకు తెలిపిన ఏసీబీ అధికారులు, అదనపు ఛార్జిషీట్ కూడా సమర్పించారు. ఈ అవినీతిపై మొదట దాఖలైన కేసు విచారించిన హైకోర్టు, మాజీ మంత్రి వేలుమణిపై నమోదైన ఆరోపణలకు ఆధారాలు లేవంటూ కేసు రద్దు చేసింది. వేలుమణిపై ఆధారాలు సేకరించినట్లయితే మళ్లీ కేసు నమోదు చేసి విచారణ జరుపవచ్చునని తెలిపింది. ఆ నేపథ్యంలో కాంట్రాక్టుల అవినీతి కేసుకు సంబంధించి అధికారులు, ప్రైవేటు సంస్థలకు వ్యతిరేకంగా దాఖలైన కేసు ఛార్జిషీటు దాఖలు చేయాలన్న ఉత్తర్వును అమలు చేయాలేదంటూ అరప్పోర్ ఇయక్కం సంస్థ ప్రతినిధులు వేసిన కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కేసు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ ఎదుట విచారణకు వచ్చింది. ఆ సందర్భంగా ఏసీబీ తరఫున దాఖలు చేసిన అదనపు ఛార్జిషీటులో వేలుమణి అవినీతి అక్రమాలకు సంబంధించి ఆధారాలు సేకరించినందున కేసులో ఆయన పేరు కూడా చేర్చాలని అధికారులు కోరారు. వాద ప్రతివాదనల అనంతరం కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కేసు విచారణను న్యాయమూర్తి ఈ నెల 12కు వాయిదా వేశారు.

సమాచార ధ్వని

తమిళనాడు నైపుణ్య వెబ్‌సైట్ ప్రారంభం

పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు నైపుణ్య రిజిస్టర్ వెబ్‌సైట్ మంగళవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. 'నాన్ ముదల్వన్' పథకం కింద విద్యార్థులకు ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణ అందించడానికి www.naanmudhalvan.tn.gov.in అనే వెబ్‌సైట్ పనిచేస్తోంది. శిక్షణ పొంది యువత వివరాలను తెలుసుకోడానికి తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ 'తమిళనాడు నైపుణ్య రిజిస్టర్' అనే డిజిటల్ వెబ్‌సైట్ ప్రారంభించింది. తమిళం, ఇంగ్లీషు ఉపయోగించి వాయిస్ టెస్టింగ్ ద్వారా, కంపెనీలు నైపుణ్యం కలిగిన శిక్షణ పొందిన వారి వివరాల ద్వారా ఉద్యోగాలివ్వొచ్చు. ఇప్పటివరకు నైపుణ్య ధృవీకరణ పత్రాలు పొందిన 13.7 లక్షల మందికి పైగా యువత వివరాలు ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచనట్లు అధికారులు తెలిపారు.

రేపు మధ్యాహ్నం వరకే రిజర్వేషన్ కౌంటర్లు

పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ రిజర్వేషన్ కౌంటర్లు శుక్రవారం మధ్యాహ్నం వరకే పనిచేయనున్నాయి. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... 'ఓనం' పండుగ సందర్భంగా రైల్వే స్టేషన్లలోని రిజర్వేషన్ కేంద్రాలు ఆదివారం టైం టేబుల్ ప్రకారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే పనిచేస్తాయని దక్షిణ రైల్వే తెలిపింది.

నేడు అడయార్‌లో విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కార శిబిరం గురువారం జరుగనుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. వేళచ్చేరి మెయిన్ రోడ్డులోని వేళచ్చేరి సబ్ స్టేషన్ ప్రాంగణంలోని అడయార్ ఎస్ఈ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న ఈ శిబిరంలో అడయార్, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వినియోగారులు సమస్యలకు పరిష్కారం పొందవచ్చని అధికారులు తెలిపారు.

రూ.20 కోట్లతో కార్మిక సంక్షేమ కేంద్రాలు

పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు వేచి ఉండేలా రూ.20 కోట్లతో 50 ప్రాంతాల్లో సంక్షేమ కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. తాగునీరు, మరుగుదొడ్డి సహా పలు వసతులతో ఈ కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో తెలిపింది.

రేపు పుదుచ్చేరి జిప్మర్‌లో ఓపీ సేవల రద్దు

పుదుచ్చేరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మిలాదున్ నబి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఓపీ బ్లాక్ విభాగం పనిచేయదని జిప్మర్ ఆస్పత్రి యాజమాన్యం ప్రకటించింది. ఆ రోజు అత్యవసర విభాగాలు మాత్రం పనిచేస్తాయని, అవుట్ పేషెంట్ విభాగాన్ని మూసివేయనుండటంతో రోగులెవ్వరూ రావద్దని బుధవారం జిప్మర్ ఆస్పత్రి నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

వృత్తి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వృత్తి నైపుణ్య సంస్థ, కన్నగి నగర్ ఫస్ట్ జనరేషన్ లెర్నింగ్ సెంటర్ సంయుక్తంగా ఉచిత వృత్తి శిక్షణ అందిస్తున్నాయి. ఏసీ మెకానిక్, విద్యుత్ వైరింగ్, మోటారు రివైండింగ్, వెహికల్ మెకానిక్స్, డ్రైవింగ్ శిక్షణ, మెషీన్ ఆపరేటర్ తదితర వాటిలో శిక్షణ ఇవ్వనున్నారు. 32 నుంచి 83 రోజుల వరకు జరిగే శిక్షణకు 8 నుంచి డిగ్రీ వరకు చదివిన 18 నుంచి 40 ఏళ్లలోపున్న వారు పాల్గొనవచ్చు. శిక్షణా సమయంలో బస, ఆహారం, ప్రోత్సాహక వేతనం, ప్రభుత్వ సర్టిఫికెటు, ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. వివరాలకు 9280086991 అనే నెంబరు సంప్రదించవచ్చు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అంబత్తూర్: అడయాలంపేట మిల్లీనియం టౌన్ ఫేస్-1 నుంచి 3 వరకు, పాడసాలై వీధి, కంబర్ నగర్ 1 నుంచి 5 వీధులు, కాసా గ్రాండ్, కేజీ, కులకర్రై వీధి, వానగరం రోడ్డ, టీటీ మాథ్యూ రోడ్డు, 200 అడుగుల సర్వీస్ రోడ్డు

రెడ్‌హిల్స్: సోతుపెరుంబేడు, కుమరన్ నగర్, చెంగాలమ్మన్ నగర్, విజయనల్లూర్, సిరునియం, పార్థసారథి నగర్, విజయ గార్డన్.

తిరువాన్మియూర్: ఇందిరా నగర్ 17 నుంచి 20, 25 నుంచి 29 క్రాస్ వీధులు, ఇందిరా నగర్ మెయిన్ రోడ్డు, కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్, ఎల్బీ రోడ్డు, ఆనంద్ అపార్ట్‌మెంట్స్.

తేనాంపేట: పోయస్ గార్డన్, టీవీ రోడ్డు, జయమ్మాళ్ రోడ్డు, ఇళంగో రోడ్డు, పోయస్ గార్డన్, రాజకృష్ణ రోడ్డు, ఎల్డామ్స్ రోడ్డు, పెరియార్ రోడ్డు, కామరాజర్ రోడ్డు, కామరాజర్ వీధి, సీతమ్మాళ్ కాలని, కేబీ దాసన్ రోడ్డు, భారతియార్ వీధి, భక్తవత్సలం వీధి, అప్పాదురై వీధి, టీటీకే రోడ్డు, కాథడ్రల్ రోడ్డు, జేజే రోడ్డు, పార్థసారధి పేట, గార్డెన్, కేఆర్ రోడ్డు, జార్జి అవెన్యూ, ఎస్ఎస్ఐ రోడ్డు, హెచ్‌డీ రాజా వీధి, ఏఆర్కే కాలని, అన్నాసాలై, వీనస్ కాలనీ, ముర్రాయిస్ గేట్ రోడ్డు.

విద్యుత్ బోర్డులో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు విద్యుత్ బోర్డులో 1,794 ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి టీఎన్‌పీఎస్సీ రాత పరీక్ష నిర్వహించనుంది. ఈ మేరకు టీఎన్‌పీఎస్సీ విడుదల చేసిన ప్రకటనలో... ఆసక్తి కలిగిన వారు బుధవారం నుంచి అక్టోబరు 2వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అక్టోబరు 6 నుంచి 8వ తేది వరకు దరఖాస్తు లోపాల సవరణకు అనుమతించనున్నారు. పరీక్ష ఫీజు ఆన్‌లైన్, యూపీఐ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఉద్యోగాలకు రూ.18,800-రూ.59,900 వరకు వేతనం అందించనున్నారు. నవంబరు 16వ తేది ఉదయం, మధ్యాహ్నం ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. నేషనల్ వొకేషనల్ సర్టిఫికెట్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ ఉన్న వారు, ప్రత్యేక కార్యక్రమం కింద ఎలక్ట్రికల్ పరిశ్రమలో చదువుకున్న వారు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉద్యోగ భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ https://tnpsc. gov.in/ Document/tamil/13_2025_CTS_II_DIPLOMA_TAMIL అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

రిటైర్డ్ న్యాయమూర్తులతో మైలాపూర్ సాయిబాబా ఆలయ కమిటీ


మైలాపూర్ సాయిబాబా ఆలయం

ప్యారీస్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్ సాయిబాబా ఆలయ నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షించిన ఆలిండియా సాయి సమాజ్ కమిటీని రద్దుచేసి ఇద్దరు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తులను నియమిస్తూ మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. మైలాపూర్‌లోని సాయిబాబా ఆలయాన్ని నిర్వహిస్తున్న ఆలిండియా సాయి సమాజ్‌కు సొంతంగా పాఠశాల, దుకాణాలు, కోట్లు విలువచేసే ఆస్తులున్నాయి. ఈ ఆస్తుల నిర్వహణ వ్యవహారంలో కమిటీ అవినీతికి పాల్పడుతుందని ఆరోపిస్తూ పలువురు సాయి భక్తులు మద్రాస్ హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ కేసు గతంలో న్యాయమూర్తులు జస్టిస్ అనితా సుమంత్, జస్టిస్ సెంథిల్ కుమార్ ధర్మాసనం ముందు విచారణకు రాగా, సమాజ్‌కు చెందిన ఆస్తుల రాబడి, ఖర్చు లెక్కలు, గుడి ఆదాయం, చిరాస్థుల విలువ, సమాజ్ పేరుతో బ్యాంకులో ఉన్న నగదు, నిబంధనల ప్రకారం సమాజ్ పనిచేస్తుందా? అని పరిశీలించి నివేదిక ఇచ్చేందుకు రిటైర్డ్ న్యాయమూర్తి ప్రకాశ్‌ను నియమించింది. ఆ మేరకు విచారణ, పరిశీలన జరిపిన జస్టిస్ ప్రకాశ్ సమగ్ర వివరాలతో నివేదికను బుధవారం న్యాయస్థానంలో దాఖలు చేశారు. సమాజ్‌లో 5,600 మందికి పైగా సర్వసభ్య మండలి సభ్యులు గతంలో ఉండేవారని, అయితే ప్రస్తుతం 522 మంది మాత్రమే ఉన్నారని, సమాజ్ నిర్వాహణలో అనేకమైన అవకతవకలున్నాయని, అందువల్ల సాయి సమాజ్ నిర్వాహక కమిటీని రద్దుచేయాలంటూ నివేదికలో ఆయన ప్రతిపాదించారు. ఈ నివేదికను అంగీకరించిన న్యాయస్థానం మైలాపూర్ సాయిబాబా ఆలయ ఆలిండియా సాయి సమాజ్ కమిటీని రద్దుచేసి, ఈ ఆలయాన్ని నిర్వహించేందుకు మద్రాస్ హైకోర్టులో పనిచేసి రిటైర్డ్ అయిన జస్టిస్ కేఎన్ బాషా, జస్టిస్ పీఎన్ ప్రకాశ్‌తో కొత్త కమిటీని నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

అంబులెన్స్ డ్రైవర్ల భద్రత కోరుతూ కేసు

● డీజీపీకి హైకోర్టు మదురై బెంచ్ నోటీసు

ప్యారీస్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 108 అంబులెన్స్ డ్రైవర్లకు భద్రత కోరుతూ దాఖలైన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలంటూ డీజీపీకి హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. మదురైకి చెందిన 108 అంబులెన్స్ డ్రైవర్ ఇరులాండి దాఖలు చేసిన పిటిషన్‌లో తాను గత 16యేళ్లుగా అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నానని, ఇటీవల కాలంలో రాజకీయ పార్టీల నేతల సభల గుండా ప్రాణపాయస్థితిలో ఉన్న రోగులను ఆస్పత్రికి తరలిస్తున్న అంబులెన్స్ డ్రైవర్లపై దాడులకు పాల్పడుతున్నారని, గత నెల 24న తిరుచ్చిలో జరిగిన అన్నాడీఎంకే ప్రచారసభలో స్పృహ కోల్పోయిన ఓ కార్యకర్తను తీసుకెళ్లడానికి వెళ్లిన అంబులెన్స్ డ్రైవర్‌పై ఆ పార్టీ కార్యకర్తలు దాడి చేసి అంబులెన్స్‌ను కూడా ధ్వంసం చేశారని, దీనిపై బాధితుడు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు లేవని తెలిపారు. అందువల్ల విధి నిర్వహణలో ఉన్న అంబులెన్స్ డ్రైవర్లకు పోలీసు భద్రత కల్పించాలని ఆ పిటిషన్‌లో కోరారు. న్యాయమూర్తులు జస్టిస్ అనితా సుమంత్, జస్టిస్ కుమరప్పన్ ధర్మాసనం ముందు ఈ పిటిషన్ బుధవారం విచారణకు రాగా, అంబులెన్స్ వాహన డ్రైవర్‌పై జరిగిన దాడికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ప్రభుత్వ తరుపు న్యాయవాది తెలిపారు. అనంతరం ఈ పిటిషన్‌కు సంబంధించి డీజీపీ వివరణ ఇవ్వాలంటూ ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 12కు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

సాత్తూరు బాణసంచా కర్మాగారంలో పేలుడు


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక దళం సభ్యులు

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా సాత్తూరు సమీపంలోని కీల్‌తాయిల్‌పట్టి గ్రామంలోని బాణాసంచా కర్మాగారంలో బుధవారం ఉదయం పేలుడు సంభవించింది. ఓ గది పైకప్పు నేలకూలింది. శివకాశికి చెందిన రామమూర్తి అనే వ్యక్తి నడుపుతున్న ఈ కర్మాగారంలో 40 గదుల్లో ఫ్యాన్సీరకం టపాసులు తయారు చేస్తున్నారు. వందమందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం రసాయనిక ద్రవాలు భద్రపరిచే గదిలో ఉన్నట్టుండి మంటలు వ్యాపించి పేలుడు సంభవించింది. దీంతో ఆ గది పైకప్పు నేలకూలింది. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో కార్మికులెవరూ గాయపడలేదు. ఈ సమాచారం తెలుసుకుని అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో వెళ్లి మంటలను పోరాడి ఆర్పారు. వెంబకోట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ఆలయ ప్రవేశానికి నిరాకరణ

స్థానికుల ధర్నా


ఉడుమల వద్ద ధర్నా చేస్తున్న స్థానికులు

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా ఉడుమల సమీపం పళ్లపాళయం ప్రాంతంలోని కరువణ్ణరాయర్ - వీరసుందరి ఆలయంలోకి ప్రవేశించకుండా ఓ వర్గం వారిని అడ్డుకోవడాన్ని ఖండిస్తూ స్థానికులు బుధవారం ఉదయం రాస్తారోకో నిర్వహించారు. ఓ వర్గానికి చెందిన ప్రజలకు ఆలయ ప్రవేశం కల్పించకపోవడానికి కారకులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కొనసాగించారు. ఈ సమాచారం తెలుసుకుని ఉడుమల డీఎస్పీ నమశివాయం సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లి ఆందోళనకారులతో చర్చించారు. ఆందోళన విరమించాలని పోలీసు ఉన్నతాధికారులు చేసిన విజ్ఞప్తిని తోసి పుచ్చి స్థానికులు రాస్తారోకో కొనసాగించడంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

బస్సు డిపో డీజిల్ ఫిల్లింగ్‌స్టేషన్‌కు భూమిపూజ


భూమిపూజలో ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ తదితరులు

తిరుత్తణి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు యూనియన్ పరిధిలోని పొదటూరుపేటలో ప్రభుత్వ బస్సు డిపో డీజిల్ ఫిల్లింగ్‌స్టేషన్ నిర్మాణం పనులను బుధవారం తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రన్ మాట్లాడుతూ 2010లో అప్పటి పళ్లిపట్టు ఎమ్మెల్యే డాక్టర్ రామన్ కృషితో పొదటూరుపేట ప్రభుత్వ బస్సు డిపో ఏర్పాటయిందన్నారు. డిపోలో వసతులు సరిగా లేకపోవడంతో అంతంతమాత్రాంగా డిపో నడుస్తోందని, డీజిల్‌కోసం బస్సులు తిరుత్తణిలో ఫిల్లింగ్ చేసుకొని రావాల్సిన పరిస్థితి నెలకొంటుందని తెలిపారు. దీనితో సమయానికి బస్సులు డిపోలో అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అందిన ఫిర్యాదులపై రవాణాశాఖ మంత్రి శివశంకర్‌కు తెలుపగా, ఆయన వెంటనే పొదట్టూరుపేట బస్ డిపోలో డీజిల్ ఫిల్లింగ్‌స్టేషన్ నిర్మించాలని ఆదేశించారని తెలిపారు. దీని బుధవారం ఉదయం ఈ పనులకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే చంద్రన్ తెలిపారు. కార్యక్రమంలో పళ్లిపట్టు డీఎంకే కార్యదర్శి రవీంద్ర, తిరుత్తణి డిపో మేనేజర్ జ్ఞానశేరన్ సహా పలువురు డీఎంకే శ్రేణులు పాల్గొన్నారు.

కోనసముద్రంలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ తదితరులు

తిరుత్తణి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు యూనియన్ పరిధిలోని కోనసముద్రం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రన్ మాట్లాడుతూ, కోనసముద్రం గ్రామంలో గత కొన్ని నెలలుగా అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుందని ప్రజల విజ్ఞప్తి మేరకు నూతన భవనం నిర్మించామన్నారు. ప్రజల కోసం పాటుపడేది ఒక్క డీఎంకే మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పళ్లిపట్టు కార్యదర్శి జి.రవీంద్ర, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి అరుళ్, పార్టీ నిర్వాహకులు గోపి, గవాస్కర్ సహా పలువురు డీఎంకే శ్రేణులు పాల్గొన్నారు.

విమానాశ్రయం నుంచి కిలాంబాక్కం వరకు మెట్రో

● రూ.1,964 కోట్లు కేటాయింపు

పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయం నుంచి కిలాంబాక్కం బస్ టెర్మినల్ వరకు మెట్రో రైలు ప్రాజెక్ట్ విస్తరించనున్నారు. నగరంలో తొలివిడత ప్రాజెక్ట్ ముగిసి రెండు మార్గాల్లో మెట్రో రైళ్లు అందుబాటులో ఉన్నాయి. రెండో విడత ప్రాజెక్ట్ మూడు భాగాల్లో 116 కి.మీ మేర చేపట్టిన పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో, మీనంబాక్కం విమానాశ్రయం నుంచి కిలాంబాక్కం బస్ టెర్మినల్ వరకు మెట్రో రైలు ప్రాజెక్ట్ విస్తరణ పనులకు రూ.1,964 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

అమెరికా ఆహారపదార్థాల బహిష్కరణ

రాష్ట్ర హోటళ్ల యజమానుల సంఘం నిర్ణయం

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా హోటళ్లలో అమెరికా పానీయాలు, ఆహార పదార్థాలను బహిష్కరించనున్నట్లు రాష్ట్ర హోటళ్ల యజమానుల సంఘం ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతీయ వస్తువుల దిగుమతిపై 50 శాతం మేర సుంకాలు విధించినందుకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బు తెలిపారు. నగరంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇకపై హోటళ్లలో పెప్సీ, కోక్, కేఎఫ్‌సీ వంటి అమెరికా ఆహార పదార్థాలు, అమెరికా సంస్థలకు చెందిన మినరల్ వాటర్స్ బహిష్కరించనున్నారని తెలిపారు. అమెరికా వస్తువులకు బదులుగా స్వదేశీ వస్తువులకు అధిక ప్రాధాన్యత కల్పించనున్నామని పేర్కొన్నారు. ఇదే విధంగా స్విగ్గీ, జోమోటో వంటి ఫుడ్ డెలివరీ సంస్థలను కూడా బహిష్కరించాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. త్వరలో సారో అనే యాప్ పరిచయం చేయనున్నామని, స్విగ్గీ, జోమోటా సంస్థల్లో పనిచేస్తున్నవారికి సారోలో పనిచేయడానికి వీలు కల్పిస్తామన్నారు.

షార్జా విమానంలో సాంకేతిక లోపం

పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి నుంచి షార్జా బయల్దేరిన ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతికలోపం ఏర్పడింది. బుధవారం ఉదయం 4.40 గంటలకు తిరుచ్చి నుంచి షార్జా వెళ్లే ఎయిర్ ఇండియా విమానం రన్‌వే పైకి వచ్చింది. ఆ సమయంలో యంత్రంలో సాంకేతిక లోపాన్ని గుర్తించిన పైలెట్ విమానాశ్రయ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ విమానంలో వెళ్లాల్సిన 150 మంది ప్రయాణికులను విశ్రాంతి గదులకు తరలించిన అధికారులు, విమానంలో తలెత్తిన సాంకేతిక లోపాన్ని నిపుణుల ద్వారా సరిచేసే పనులు చేపట్టారు.

వినాయక ప్రతిమల నిమజ్జనానికి రుసుము ఎందుకు లేదు...?

పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఎందుకు రుసుము వసూలచేయడం లేదంటూ చెన్నై కార్పొరేషన్‌ను గ్రీన్ ట్రిబ్యునల్ ప్రశ్నించింది. పట్టణంబాక్కం సముద్రతీరంలో నిమజ్జనం చేసిన విగ్రహాల వ్యర్థాల తొలగింపులో వైఫల్యం చూపారనే కేసు విచారణ సందర్భంగా జాతీయ హరిత ట్రిబ్యునల్ ఈ విధంగా పేర్కొంది. పట్టణంబాక్కం బీచ్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించడంలో కార్పొరేషన్ విఫలమైందని, నిమజ్జనానికి రుసుము వసూలుచేస్తే, నిమజ్జనం అనంతరం వ్యర్థాలు తొలగించేందుకు ఈ రుసుము వినియోగించుకోవచ్చు కదా? అంటూ సూచించింది. అలాగే, ప్రమాదకరం కాని పదార్థాలతో తయారుచేసిన విగ్రహాలు మాత్రమే నిమజ్జనానికి అనుమతించాలని గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించింది.

పెరిగిన నెలవారీ బస్ పాస్ విక్రయాలు

పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'కొత్త విద్యుత్ ఏసీ' బస్సులు పరిచయం చేయడంతో రూ.2,000 పాస్ కొనుగోలు చేసే వారి సంఖ్య వంద శాతం పెరిగిందని మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) అధికారులు తెలిపారు. ఎంటీసీ ఆధ్వర్యంలో 50 ఏసీ బస్సులు నడుపుతుండగా, కొత్తగా 55 విద్యుత్ ఏసీ బస్సులు గత నెల 11వ తేది నుంచి ప్రారంభమయ్యాయి. దీంతో, ఏసీ బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య పెరిగింది. ఏసీ బస్సుల్లో కూడా ప్రయాణించేందుకు వీలుగా రూ.2,000 నెలవారీ బస్ పాస్ పరిచయం చేశారు. తొలిరోజుల్లో నెలకు 150 మంది మాత్రమే ఈ బస్ పాస్ కొనుగోలు చేస్తుండగా, ఏసీ బస్సుల రాకతో ప్రస్తుతం బస్ పాస్ కొనుగోలు చేసే వారి సంఖ్య 500లకు పెరిగింది. రాబోయే రోజుల్లో ఏసీ బస్సుల సంఖ్య పెంచనున్నట్లు ఎంటీసీ అధికారులు తెలిపారు.

'ఉంగలుడన్ స్టాలిన్'తో పెరిగిన పనిభారం

● దిండుగల్‌లో ఉద్యోగుల ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'ఉంగలుడన్ స్టాలిన్' విజ్ఞప్తుల స్వీకరణ శిబిరాల నిర్వహణతో తమకు పనిభారం పెరిగిందంటూ దిండుగల్‌లో రెవెన్యూ ఉద్యోగులు రెండు రోజుల ఆందోళన చేపట్టారు. రెవెన్యూశాఖలో మూడేళ్లకు పైగా ఖాళీగాఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అన్ని తాలూకా కార్యాలయాల్లో డిప్యూటీ తహసీల్దార్ పోస్టులను ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్ల సాధన దిశగా వందమందికిపైగా రెవెన్యూఉద్యోగులు బుధవారం ఉదయం ధర్నా నిర్వహించారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ కోశాధికారి దురైరాజ్ నాయకత్వం వహించిన ఈధర్నాలో జిల్లా శాఖ కార్యదర్శి సుగంధి, సర్వేయర్ల సంఘం కార్యదర్శి విగ్నేష్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా విభాగం అధ్యక్షుడు ముబారక్ అలీ పాల్గొన్నారు.

మరక్కాణంలో ఉప్పు ఉత్పత్తికి అంతరాయం

● కార్మికులకు కష్టాలు

అడయార్, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా మరక్కాణంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సుమారు 3500ఎకరాల్లో ఉప్పుఉత్పత్తి ప్రాంతాలున్నాయి.ఈ కేంద్రాల ద్వారా 25 లక్షల టన్నుల ఉప్పు ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఉప్పు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఈ కారణంగా వందలాది మంది కార్మికులు రోజువారీ ఉపాధి కోల్పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. తమను ప్రభుత్వాలే ఆదుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

మాజీ మంత్రి ఇంటికి బాంబు బెదిరింపు

పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి సి.విజయభాస్కర్ ఇల్లు, ప్రైవేటు పాఠశాలకు బాంబు బెదిరింపు వచ్చింది. పుదుకోట జిల్లా ఇలుప్పూర్‌లోని మాజీ మంత్రి విజయభాస్కర్ ఇంటికి బుధవారం ఉదయం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. అలాగే, ఇలుప్పూర్ రాజేశ్వరి టౌన్ షిప్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలకు కూడా ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. మధ్యాహ్నం 2 గంటలకు, 20 నిముషాల అనంతరం బాంబు పేలుతుందని ఉంది. సమాచారం అందుకున్న ఇలుప్పూర్ పోలీసులు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో రెండు ప్రాంతాలకు చేరుకుని, క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించి, ఈ-మెయిల్ పంపిన చిరునామా కోసం విచారిస్తున్నారు.

నాణేలు మింగిన బాలిక

● తొలగించిన వైద్యులు

పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల బాలిక మింగిన రెండు నాణేలను వైద్యులు శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. తిరుపత్తూర్ జిల్లా తిరుపత్తూర్ కోట ప్రాంతానికి చెందిన దిల్షాన్ కుమార్తె నిస్సా (7) సోమవారం సాయంత్రం నిస్సా రూ.1, రూ.2 నాణేలతో ఆడుకుంటూ రెండు నాణేలు మింగింది. కొద్దిసేపటి అనంతరం కడుపు నొప్పితో బాధపడుతున్న కుమార్తెను తల్లిదండ్రులు తిరుపత్తూర్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల ఎక్స్‌రే తీయగా, పేగుల్లో రెండు నాణేలు చిక్కినట్లు గుర్తించి, శస్త్రచికిత్స ద్వారా రెండు నాణేలు వెలికితీశారు.

చెన్నైలో చోరీకి గురైన కారు

● పాకిస్తాన్ సరిహద్దుల్లో స్వాధీనం

పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో చోరీకి గురైన కారును పాకిస్తాన్ సరిహద్దుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అన్నానగర్‌లో నిలిపిన కారు జూన్ 6న చోరీకి గురైంది. కారు యజమాని అందజేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి విచారించి, కారు చోరీ చేసిన సత్యేంద్ర షెకావత్‌ను అరెస్ట్ చేసి చేపట్టిన విచారణలో... షెకావత్ 20 ఏళ్లుగా కార్లు చోరీ చేసినట్లు, ముఖ్యంగా, లగ్జరీ కార్లు చోరీ చేసి ఉత్తరాది రాష్ట్రాల్లో విక్రయిస్తుంటాడని తెలిసింది. దీంతో, 80 రోజులుగా పలు రాష్ట్రాల్లో గాలించిన పోలీసులు, రాజస్తాన్ రాష్ట్రం పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతం జైసల్మర్ జిల్లాలో గుర్తించి స్వాధీనం చేసుకుని నగరానికి తీసుకొచ్చినట్లు పోలీసు శాఖ తెలిపింది.

విద్యార్థులతో కాళ్లు పట్టించుకున్న హెచ్‌ఎం ట్రాన్స్‌ఫర్

పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులచే కాళ్లు ఒత్తించుకున్న ప్రధానోపాధ్యాయురాలిపై బదిలీ వేటు పడింది. ధర్మపురి జిల్లా మావేరిపట్టిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా కలైవాణి పనిచేస్తున్నారు. కాగా హెచ్‌ఎం కలైవాణి ప్రతిరోజ విద్యార్థులతో కాళ్లు ఒత్తించుకుంటున్న వీడియో మంగళవారం సామాజిక మాధ్యమాల్లో వెలువడింది. ఈ వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమార్, అధికారులు పాఠశాలకు వెళ్లి విచారించి, ప్రధానోపాధ్యాయురాలిని బదిలీ చేస్తున్నట్లు తెలిపారు.

తిరుత్తణి ఘాట్ మరమ్మతులు ప్రారంభం



తిరుత్తణి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఘాట్‌రోడ్డు మరమ్మతులు ప్రారంభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో, గత సోమ, మంగళవారాలు కొండపైకి కార్లు, ఆటోలు, లారీలు సహా భారీ వాహనాలను నిషేధించి రూ.కోటి వ్యయంతో నడకదారి నుండి ఆలయం వరకు ఘాట్‌రోడ్డు పునరుద్ధరణ పనులకు ఆలయ నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. బుధవారం తెల్లవారుజాము నుండి యథావిధిగా అన్ని రకాల వాహనాలను కొండపైకి అనుమతించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

● కాట్టుపళ్లిలో పోలీసులపై దాడి ....

29 మంది వలస కార్మికుల అరెస్ట్


కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్యారీస్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా మీంజూరు సమీపంలోని కాట్టుపళ్లిలో పోలీసులపై రాళ్లతో దాడికి పాల్పడిన 29 మంది వలస కార్మికలను అరెస్టు చేసినట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పోలీసులు తెలిపారు. ప్రమాదంలో మృతిచెందిన యూపీకి చెందిన అమర్‌ప్రసాద్‌కు నష్టపరిహారం కోరుతూ సహ కార్మికులు మంగళవారం ఉదయం ఆందోళన చేపట్టారు. ఆందోళనకు అనుమతి లేదన్న పోలీసులపై ఆ కార్మికులు రాళ్లతో దాడికి దిగడంతో 20 మందికి పైగా గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో కార్మికుడి కుటుంబానికి రూ.5లక్షలు నష్టపరిహారాన్ని ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రకటించింది. రాళ్లదాడికి పాల్పడిన 29 మంది వలస కార్మికులను అరెస్టు చేసి బుధవారం ఉదయం పొన్నేరి మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సబ్‌స్టేషన్ ప్రారంభం


సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి యూనియన్ పరిధిలోని బుచ్చిరెడ్డిపల్లె గ్రామంలో సబ్ స్టేషన్‌ను బుధవారం తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బుచ్చిరెడ్డిపల్లె పరిసర ప్రాంతాల్లో ప్రతి రోజు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందనే ప్రజల విజ్ఞప్తి మేరకు 11కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి గత నెలలో శంకుస్థాపన చేశామన్నారు. అనంతరం నిర్మాణం పూర్తయిన సబ్ స్టేషన్‌ను బుధవారం ఉదయం ప్రారంభించినట్లు ఎమ్మెల్యే చంద్రన్ తెలిపారు.

కోవైలో త్వరలోనే ప్రభుత్వ ఎలక్ట్రిక్ బస్సులు

ప్యారీస్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో లాగే పరిశ్రమల నగరం కోయంబత్తూరులో కూడా త్వరలోనే ఎలక్ట్రిక్ బస్సు సేవలను ప్రారంభించనున్నట్లు స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ (ఎస్ఈటీసీ) అధికారులు తెలిపారు. ఇంధనం ఖర్చు ఆదా చేయడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించడం, ప్రయాణికులకు అదనపు వసతులు అందించేలా చెన్నై నగరంలో ప్రభుత్వ ఎలక్ట్రిక్ బస్సు సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇదే విధంగా రాష్ట్రంలో పెద్దనగరాలైన మదురై, తిరుచ్చి, కోవై తదితర ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు ప్రభుత్వ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో, కోయంబత్తూరు ప్రాంత ప్రజలు ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని ఎస్ఈటీసీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో, ప్రజారవాణా వ్యవస్థ మెరుగుపరిచేలా తొలివిడతగా జిల్లాలో గాంధీపురం టౌన్ బస్‌స్టేషన్‌నుండి వంద లో ఫ్లోర్‌బోర్డు లగ్జరీ బస్సులు సహా 602 సిటీ బస్సులను నడుపుతున్నారు. అలాగే ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు అనుకూలంగా కోవై నగరంలో చార్జింగ్ కేంద్రాలకు అధికారులు స్థలాన్ని పరిశీలిస్తున్నారు. రహదారులు, విద్యుత్ బోర్డు, కాలుష్య నియంత్రణ మండలి తదితర శాఖల నుండి అనుమతులు వచ్చాక త్వరలోనే ఎలక్ట్రిక్ బస్సు సేవలను ప్రారంభించనున్నట్లు ఎస్ఈటీసీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

145 మద్యం బాటిళ్ళతో వచ్చిన ఆరుగురి అరెస్టు

అడయార్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి నుంచి ఒక కంటైనర్ లారీలో అక్రమంగా 145 మద్యం బాటిళ్ళను రాష్ట్రంలోకి తీసుకొచ్చిన ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. సేలం జిల్లా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నందకుమార్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం మంగళవారం రాత్రి కారిపట్టి ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో ఒక కంటైర్ లారీని తనిఖీ చేయగా, అందులో 145 మద్యం బాటిళ్ళు గుర్తించారు. వీటిని పుదుచ్చేరి నుంచి అక్రమంగా తీసుకొస్తున్నట్టు విచారణలో వెల్లడైంది. దీంతో లారీ డ్రైవర్ విజయలక్ష్మణ కుమార్ (58), సేలం జిల్లాకు చెందిన కుమరేశన్ (29), లోకనాథన్ (28), మదియళగన్ (27), ఆనంద్ కుమార్ (23), ప్రకాష్ (28)లను అరెస్టు చేశారు. వివాహ వేడుకలో స్నేహితులకు మద్యం పార్టీ ఇచ్చేందుకు ఈ మద్యం బాటిళ్ళను తీసుకొస్తున్నట్టు వారు వెల్లడించారు.



'కుమార సంభవం' ఆడియో రిలీజ్ దృశ్యం

కుమరన్ తంగరాజన్ కల నెరవేరింది

● హీరోగా తొలి చిత్రం 'కుమార సంభవం'

హీరో కావాలన్న తన 17 యేళ్ళనాటి కలను బుల్లి తెర నటుడు కుమరన్ తంగరాజన్ నెరవేర్చుకున్నారు. 'పాండియన్ స్టోర్స్' అనే టీవీ సీరియల్‌లో నటించి తనకుంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న కుమరన్ తంగరాజన్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'కుమార సంభవం'. బాలాజీ వేణుగోపాల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలకానుండగా ఆడియో, ట్రైలర్‌ను మంగళవారం రాత్రి నగరంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సౌండ్ డిజైనర్ శరవణన్, 'సరిగమ' ఆనంద్, ఎడిటర్, మదన్, సంగీత దర్శకుడు అచ్చు రాజమణి, నటీనటులు వినోద్ మున్నా, కుమారవేల్, శివ అరవింద్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రంలో కుమరన్ తంగరాజన్ సరసన పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా, ఇతర పాత్రల్లో జీఎం కుమార్, బాల శరవణన్, వినోద్ సాగర్, లివింగ్‌స్టన్ తదితరులు నటించారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వీనస్ ఇన్ఫోటైన్‌మెంట్ తరపున కేజీ గణేష్ నిర్మించారు. హీరో కుమరన్ తంగరాజన్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో 'సినిమా నా లక్ష్యం' అనే డైలాగ్ ఉంది. ఇది నా నిజ జీవితానికి సరిపోతుంది. ఎందుకంటే కథానాయకుడు కావాలన్నది 17 యేళ్ళనాటి కల. అది ఇప్పటికి నెరవేరింది. నాకు ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేదు. మా నాన్న టీ దుకాణంలో పనిచేస్తారు. ఆయన ఓ రోజు నువ్వు సినిమాలో హీరో కావాలని కోరారు. అప్పటి నుంచి నాకు సినిమాలపై ఆశ పెరిగి నటించడం మొదలుపెట్టాను. 'పాండియన్ స్టోర్స్'లో అవకాశం లభించడంతో పాటు నా కంటే ఓ గుర్తింపు వచ్చింది. ఈ చిత్రం ద్వారా హీరోగా పరిచయమవుతున్నాను' అని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

హిట్ కోసం పరితపిస్తున్న రుక్మిణీ వసంత్

శాండల్‌వుడ్ హీరోయిన్ రుక్మిణీ వసంత్ తమిళంలో సరైన హిట్ కోసం ఎదురు చూస్తున్నారు. కోలీవుడ్‌లో హీరో విజయ్ సేతుపతితో కలిసి 'ఏస్' మూవీలో నటించి తమిళ ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఆ చిత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకాదరణ పొందలేదు. భారీ అంచనాల మధ్య విడుదలైనప్పటికీ మిశ్రమ స్పందన తెచ్చుకుంది. ఇపుడు శివకార్తికేయన్ సరసన 'మదరాసి' చిత్రంలో నటించారు. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలకానుంది. తన తొలి చిత్రం 'ఏస్' పరాజయం కావడంతో రెండో చిత్రమైన 'మదరాసి' విజయం సాధిస్తుందన్న గట్టి నమ్మకంతో ఆమె ఉన్నారు.



'గట్టా కుస్తి-2' షూటింగ్ ప్రారంభం

విష్ణు విశాల్ హీరోగా నటించిన హిట్ చిత్రం 'గట్టా కుస్తి'. ఈ చిత్రం రెండో భాగం తెరకెక్కనుంది. వేల్స్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, విష్ణు విశాల్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తుండగా, సంప్రదాయ పూజా కార్యక్రమంతో షూటింగ్ తాజాగా ప్రారంభించారు. చెల్లా అయ్యావు దర్శకుడు. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన ఈ మూవీలో విష్ణు విశాల్, ఐశ్వర్య లక్ష్మి జంటగా నటించగా, ఇతర పాత్రల్లో కాళి వెంకట్, మునిష్కాంత్, కరుణాస్ తదితరులు నటించారు. ఇపుడు ఈ హిట్ కాంబినేషన్‌లోనే రెండో భాగం తెరకెక్కనుంది. సింగిల్ షెడ్యూల్‌లో ఈ సినిమా షూటింగ్‌ను పూర్తి చేయనున్నారు. ఈ రెండో భాగం ప్రోమోకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చిన విషయం తెల్సిందే. నిజానికి తొలి భాగంలోనే ఈ సినిమా స్టోరీ ముగిసిపోయింది. అయినప్పటికీ దానికి కొనసాగింపుగా స్పోర్ట్స్ డ్రామా శైలిలో విడిపోయిన భార్యాభర్తలు తిరిగి కలుసుకున్న తర్వాత కుటుంబంలో జరిగే ప్రధాన సమస్యలతో హాస్యభరితంగా తెరకెక్కించనున్నారు. చెన్నై, పొల్లాచ్చి, పాలక్కాడ్ తదితర ప్రాంతాల్లో చిత్రీకరించనున్నారు.


చెల్లా అయ్యావు, ఐశ్వర్య, విష్ణు విశాల్, ఐసరి కె.గణేష్ తదితరులు

అనిరుధ్ సంగీతం లేకుండా సినిమా ఉండదు

● లోకేష్ కనకరాజ్

భవిష్యత్‌లో ఏ సినిమా కూడా అనిరుధ్ సంగీతం లేకుండా తీయనని, ఒక వేళ అనిరుధ్ చిత్రపరిశ్రమ నుంచి వైదొలగితే మరో సంగీత దర్శకుడు లేదా కృత్రిమ మేథ కోసం ఆలోచన చేస్తానని ప్రముఖ దర్శకుడు లోకేష్ కనకరాజ్ స్పష్టం చేశారు. తాజాగా కోవైలో జరిగిన ఒక కాలేజీ ఫంక్షన్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, "కూలీ' ఒక టైమ్ ట్రావెల్ మూవీ. ఎల్.సి.యు అని నేను ఎన్నడూ చెప్పలేదు. ప్రేక్షకులే అలా ఊహించుకున్నారు. సుమారు 18 నెలల పాటు సినిమా గురించి ఎక్కడా మాట్లాడలేదు. ప్రేక్షకుల అంచనాలను దృష్టిలో ఉంచుకుని నేను కథలు సిద్ధం చేయను. కథ రాస్తాను, అది వారికి నచ్చాలని ఆశిస్తాను. ఒక వేళ వారి అంచనాలను అందుకోలేకపోతే మళ్ళీ ప్రయత్నిస్తాను. 'కూలీ' సినిమాలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశాల్లో రజనీకాంత్ నటించారు. వాటిని డీ-ఏజింగ్ చేశాం. ఆ సన్నివేశాల్లో వినిపించే రజనీ వాయిస్‌ను ఏఐ టెక్నాలజీని ఉపయోగించి క్రియేట్ చేయడం జరిగింది. రూ.కోట్లు రాబట్టే సినిమాలు చేయడమే సక్సెస్ కాదు. ఎంత నిడివున్న చిత్రమైనా మనం అనుకున్న కథను అనుకున్నట్టుగా ప్రేక్షకులకు చెబితే దర్శకుడిగా విజయవంతమైనట్టే. బాక్సాఫీస్ లెక్కలు నిర్మాతలకే. వాటితో దర్శకులకు పనిలేదు' అని పేర్కొన్నారు.


అనిరుధ్ - లోకేష్ కనకరాజ్


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

విరుదునగర్‌లో నేత్రపర్వంగా మీనాక్షి అమ్మవారి రథోత్సవం

ప్యారీస్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్‌లో ప్రసిద్ధి చెందిన పురాతన మీనాక్షి సమేత చొక్కనాథస్వామి ఆలయంలో బుధవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయంలో గత నెల 27న ధ్వజారోహణంతో ఆవణి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో ప్రధాన ఘట్టమైన తిరుకల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. బుధవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రాష్ట్రమంత్రి సాత్తూరు రామచంద్రన్ రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ ప్రధాన ప్రవేశ ద్వారం నుండి కదిలిన రథం రాజావీధి మెయిన్ బజార్, మాడవీధుల మీదుగా సాగి మళ్ళీ ఆలయ వద్దకు చేరుకుంది. 6వ తేదీ ఉత్సవ శాంతిపూజలతో ఈ వేడుకలు పూర్తవుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

హొగెనేకల్ జలపాతంలో దోనెల సవారీకి అనుమతి



పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హొగెనేకల్ జలపాతంలో నీటి ఉధ్రుతి తగ్గడంతో దోనెల సవారీకి జిల్లా యంత్రాంగం అనుమతించింది. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోని కావేరి నది పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాల కారణంగా కర్ణాటక రాష్ట్రంలోని కబిని, కృష్ణరాజపురం డ్యాంల నుంచి అదనపు జలాలు విడుదల చేశారు. దీంతో, హొగెనేకల్ వద్ద నీటి ప్రవాహం 43వేల ఘనపుటడుగులుండడంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా దోనెల సవారీ నిలిపివేశారు. బుధవారం ఉదయం 9,500 ఘనపుటడుగులకు నీటి ప్రవాహం తగ్గడంతో దోనెల సవారీకి అనుమతిస్తూ ధర్మపురి జిల్లా కలెక్టర్ ఆర్.సతీష్ ప్రకటన విడుదల చేశారు.

ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తమిళనాడు

● కళాశాల విద్యార్థినుల ర్యాలీ

ప్యారీస్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తమిళనాడును రూపొందించేలా కృషిచేద్దామంటూ కొరట్టూరులోని భక్తవత్సలం మెమోరియల్ మహిళా కళాశాల విద్యార్థినులు పిలుపునిచ్చారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్, రాష్ట్రప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ, ఆరోగ్యశాఖల సంయుక్త నిర్వహణలో బుధవారం ఉదయం కొరట్టూరు ప్రాంతంలో మళ్ళీ పసుపు గుడ్డ సంచినే ఉపయోగిద్దాం...ప్లాస్టిక్ నిర్మూలిద్దామనే నినాదంతో అవగాహన ప్రచారం సాగింది. ఇందులో భక్తవత్సలం మహిళా కళాశాల విద్యార్థినుల ఉత్సాహంగా పాల్గొని పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం.. ఆరోగ్యవంతమైన సమాజం కోసం అందరం కలిసి కృషిచేద్దామనే నినాదాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.


ర్యాలీలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

తాంబరం-విల్లుపురం రైళ్ల వేళల్లో మార్పులు

ప్యారీస్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దక్షిణ రైల్వే తిరుచ్చి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా తాంబరం-విల్లుపురం రైళ్లతో పాటు ఐదు రైళ్ల వేళల్లో మార్పులు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. తాంబరం నుండి ఉదయం 9.45 గంటలకు విల్లుపురం బయలుదేరే ప్యాసింజర్ రైలు ఈ నెల 6,9 తేదీల్లో ముండియంబాక్కం-విల్లుపురం మధ్య పాక్షికంగా రద్దుచేశారు. ఇందు వల్ల ఈ రైలును తాంబరం నుండి ముండియంబాక్కం వరకు మాత్రమే నడుపుతారు. అదేవిధంగా విల్లుపురం నుండి మధ్యాహ్నం 1.45 గంటలకు చెన్నై బీచ్‌కు బయలుదేరాల్సిన రైలు 6, 9వ తేదీల్లో విల్లుపురం-ముండియంబాక్కం మధ్య పాక్షికంగా రద్దు. ఇందువల్ల ఆ రైలు ముండియంబాక్కం నుండి మధ్యాహ్నం 1.55 గంటలకు బయలుదేరుతుంది. విల్లుపురం నుండి మధ్యాహ్నం 2.35 గంటలకు బయలుదేరాల్సిన మైలాడుదురై రైలు 6,9 తేదీల్లో 20 నిమిషాలు ఆలస్యంగా మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరుతుంది. అంతేకాకుండా గుంతకల్లు రైల్వే డివిజన్‌లో కాట్పాడి-తిరుపతి మధ్య రైల్వేమార్గంలో ఇంజనీరింగ్ పనులు చేపట్టనున్న కారణంగా విల్లుపురం-తిరుపతి ఎక్స్‌ప్రెస్ సేవలు పాక్షికంగా రద్దుచేశారు. విల్లుపురంలో తెల్లవారుజామున 5.40 గంటలకు తిరుపతికి బయలుదేరాల్సిన ఎక్స్‌ప్రెస్ 5,7,8,9 తేదీల్లో కాట్పాడి-తిరుపతి మధ్య పాక్షికంగా రద్దుకానుంది. ఇందువల్ల ఈ రైలును కాట్పాడి వరకు మాత్రమే నడుపుతారు. మరుమార్గంలో తిరుపతి నుండి విల్లుపురం బయలుదేరాల్సిన ఇంటర్సిటీ ఎక్స్‌ప్రెస్ గురువారం శుక్రవారం, 7,8,9 తేదీల్లో తిరుపతి-కాట్పాడి మధ్య పాక్షికంగా రద్దు కానుందని సదరన్ రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

కొళత్తూరులో 'ఓనం' సందడి

ప్యారీస్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలో జరిగే పండుగల్లో ఓనం అతిపెద్ద పండుగ. శుక్రవారం వామన జయంతిగా జరుపుకోనున్నారు. శ్రావణ నక్షత్రాన్ని మలయాళంలో 'తిరు ఓనం' అంటారు. ఆ రాష్ట్రంలో ఈ పండుగను పది రోజులు కోలాహలంగా నిర్వహించనున్న నేపథ్యంలో, రాజధాని నగరం చెన్నైలో ముందుగానే పండుగ వాతావరణం కనిపించింది. కేరళ ఆచారాలు, సంప్రదాయాలతో ముడిపడిన ఓనంను ఘనంగా ఆహ్వానిస్తూ బుధవారం కొళత్తూరులోని ఎస్ఆర్‌పీ కాలనీలోని జయగోపాల్ కరోడియా పాఠశాల చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకరట్టుకున్నాయి. మహాబలి చక్రవర్తి ఆకారం సహా రకరకాల పూలతో వేదిక ప్రాంగణాలను అందంగా తీర్చిదిద్ది కేరళ సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థినులు ఆకట్టుకున్నారు. కైకొట్టి కలి నృత్యం చేశారు. అదేవిధంగా కొంతమంది చిన్నారులు మహాబలి చక్రవర్తి, పులుల వేషధారణలతో సందడి చేశారు. ఇదిలా ఉండగా, ఓనం పండుగ సందర్భంగా కోడంబాక్కం, అన్నానగర్, తిరువొత్తియూర్, రాజాఅన్నామలై పురంలోని అయ్యప్ప ఆలయాలు సహా నగరంలో అయ్యప్ప స్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. మరోవైపు ఓనం పండుగకు అవసరమైన వస్త్రాలు, పూజాసామగ్రి అమ్మకాలు ఊపందుకున్నాయి.



ఓనం సంప్రదాయ వస్త్రధారణలతో సందడి - బలి చక్రవర్తి ఆకారంలో ఉన్న రంగవల్లికలతో చిన్నారులు

అగ్నితీర్థం వద్ద విపత్తుల నివారణపై మాక్ డ్రిల్


రామేశ్వరం అగ్నితీర్థం వద్ద మాక్‌డ్రిల్ చేస్తున్న అగ్నిమాపక దళం


నీటిలో మునిగినవారికి ప్రాథమిక చర్యలపై ప్రదర్శిస్తున్న దృశ్యం

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం అగ్నితీర్థం వద్ద అగ్నిమాపక దళం నిర్వహించిన విపత్తు నిరోధక విన్యాసాలను చూసి భక్తులు, స్థానికులు విస్తుపోయారు. బుధవారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో ఫైరింజన్ వేగంగా వెళ్ళి సముద్ర తీరంలో నిలవటం, అందులోని అగ్నిమాపక సిబ్బంది దిగి సముద్రంలోకి దిగటం, ఆలోగా నీట మునిగినవారుగా నటించిన ఇద్దరిని వెలికి తీయడం వంటి చర్యలు చేపట్టారు. ఇదంతా నిజమేననుకున్న భక్తులు భయాందోళన చెందారు. అగ్నిమాపక సిబ్బంది మెగాఫోన్ పట్టుకుని అగ్నితీర్థంలో పలువురు భక్తులు నీట మునిగారు... ఒడ్డున ఉన్నవారంతా దూరంగా వెళ్లండి అని ప్రకటించగానే నిజమేననుకుని భక్తులంతో పరుగులు తీశారు. ఆ తర్వాత స్ట్రెచర్‌లపై పడుకున్న ఇద్దరిని ఒడ్డున పడుకోబెట్టి శ్వాస కల్పించే ప్రాథమిక చికిత్స చేశారు. పూర్తిగా తడిసిపోయిన నలుగురైదుగురు యువకులను అగ్నిమాప సిబ్బంది రబ్బరు బోట్లలో ఒడ్డుకు చేర్చారు. సుమారు అరగంట పాటు జరిగిన ఈ దృశ్యాలు మాక్ డ్రిల్ అని తెలుసుకున్న భక్తులతా ఊపిరి పీల్చుకున్నారు.

నేపియర్ వంతెన-కోవలం మధ్య 'వాటర్ మెట్రో' ప్రాజెక్ట్

● తొలివిడత పరిశీలన పనులు ప్రారంభం



పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా, పర్యాటకాభివృద్ధికి 'వాటర్ మెట్రో' ప్రాజెక్ట్ సిద్ధమైంది. ఈ ప్రాజెక్ట్ మొదటి విడత పరిశీలన పనులు ప్రారంభమయ్యాయి. 'వాటర్ మెట్రో' అనేది ఆధునిక సౌకర్యాలతో మెట్రో రైలు మాదిరిగానే నీటిపై తేలియాడే రవాణా శకటం. కేరళ రాష్ట్రం కొచ్చిన్‌లో 2023లో ప్రారంభించారు. కొచ్చిన్ హైకోర్టు సహా 16 వేర్వేరు మార్గాల్లో వాటర్ మెట్రో ప్రారంభించాలని నిర్ణయించగా, ప్రస్తుతం కొచ్చిన్‌లో నాలుగు మార్గాల్లో అందుబాటులో ఉంది. ఈ ప్రాజెక్ట్‌ను నగరంలో కూడా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తొలివిడతగా నేపియర్ వంతెన నుంచి కోవలం వరకు పడవ రవాణా ప్రారంభించనున్నారు. వాటర్ మెట్రో పర్యాటకులకు మాత్రమే కాకుండా, ప్రజా రవాణాకు కూడా వినియోగించాలని నిర్ణయించింది. బోట్ స్టేషన్లు, వర్క్ షాప్‌ల కోసం స్థలాల ఎంపిక, వివిధ మౌలిక సదుపాయాలు, ప్రాజెక్ట్ సాధ్యాసాధ్యాలపై అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ పనులను చెన్నై ఇంటిగ్రేటెడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ, జలవనరుల శాఖ, తమిళనాడు మారిటైమ్ బోర్డు సహా వివిధ విభాగాలు సంయుక్తంగా పరిశీలించాయి. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ.. నేపియర్ వంతెన నుంచి కోవలం వరకు 53 కి.మీ మేర వాటర్ మెట్రో ప్రాజెక్ట్ చేపట్టనున్నామన్నారు. వాటర్ మెట్రో నిర్వహణకు కూవం (నేపియర్ వంతెన), కోవలం మధ్య బకింగ్ హామ్ కాలువలో పూడికతీసి, పునరుద్ధరించాల్సి ఉంటుందన్నారు. కాలువ పునరుద్ధరణ, వాటర్ మెట్రో ప్రాజెక్ట్ నిర్వహణకు రూ.3వేల కోట్ల నుంచి రూ.5వేల కోట్ల వరకు ఖర్చవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ సమగ్ర నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనున్నామని, ప్రభుత్వ అనుమతి లభించిన వెంటనే, ప్రాజెక్ట్ ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

జ్యోతిషంపై పాఠ్యాంశం తొలగించండి : ఎస్ఎఫ్ఐ




ధర్నాలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు - అరెస్ట్ చేస్తున్న పోలీసులు

అడయార్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జ్యోతిష్యం పాఠ్యాంశం తొలగించాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 'జ్యోతిష్యం' పాఠ్యాంశంగా చేర్చనున్నట్లు యూజీసీ నిర్ణయించింది. యూజీసీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నుంగంబాక్కంలోని శాస్త్రి భవన్ ఎదుట కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఉన్నత విద్య కాషాయికరణ చేసేలా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేశారు. కార్యకర్తలు రాస్తారోకోకు యత్నించగా, పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

శ్రీరంగం ఆలయంలో పవిత్రోత్సవాలు

అడయార్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా శ్రీరంగంలోని రంగనాథస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వేదమంత్రోచ్చారణల మధ్య బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ ఆలయంలో ప్రతియేటా ఆవణి - పురటాశి మాస పవిత్రోత్సవం వేడుకలు తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. ఈ వేడుకల ప్రారంభరోజైన బుధవారం ఉదయం 9.15 గంటలకు పండితుల వేద మంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలతో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు జరిగే రోజుల్లో మూలవిరాట్టు నంపెరుమాళ్ ప్రతి రోజూ సాయంత్రం మూలస్థానం నుంచి బయలుదేరి బంగారు ధ్వజస్తంభం సమీపంలో ఉన్న పవిత్రోత్సవ మండపం వద్ద భక్తులకు దర్శనమిస్తారు.

నేడు చెన్నైలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం నిర్వహించనున్న 'ఉంగుడన్ స్టాలిన్' ప్రత్యేక పథక శిబిరాల వివరాలకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ విడుదల చేసింది. ఆ ప్రకారం... తిరువొత్తియూర్ మండలం పరిధిలో 1వ వార్డు కత్తివాక్కం హైరోడ్డులోని కత్తివాక్కం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం, మాధవరం మండలం పరిధిలో 24వ వార్డు అంతోన్ నగర్‌లో ఉన్న దియా కల్యాణ మండపం, తండయార్‌పేట మండలం పరిధిలో 38వ వార్డు తండయార్‌పేట పటేల్ నగర్‌లోని చెన్నై ఉన్నత పాఠశాల, రాయపురం మండలం పరిధిలో 62వ వార్డు చింతాద్రిపేట అరుణాచలం రోడ్డులోని మే డే పార్క్ మైదానం, తిరువిక నగర్ మండలం పరిధిలో 64వ వార్డు శ్రీనివాసన్ నగర్‌లోని పాత పాఠశాల భవనంలో జరుగనుంది. అంబత్తూర్ మండలం పరిధిలో 85వ వార్డులోని దన్‌లప్ మైదానం, అన్నానగర్ మండలం పరిధిలో 105వ వార్డు అరుంబాక్కం ఎంఎండీఏ కాలనీలోని మహ్మద్ సదక్ మెట్రిక్యులేషన్ మహోన్నత పాఠశాల, తేనాంపేట మండలం పరిధిలో 126వ వార్డు మందవెల్లి కెనాల్ బ్యాంక్ రోడ్డు సమీపంలోని అల్ఫోన్సా క్రీడా మైదానంలోని ఆడిటోరియం, అడయార్ మండలం పరిధిలో 168వ వార్డు గిండి లేబర్ కాలనీ అరుళమ్మపేట మెయిన్ రోడ్డులోని లయన్స్ క్లబ్ ప్రాథమిక పాఠశాల, పెరుంగుడి మండలం పరిధిలో 184వ వార్డు అంబేడ్కర్ నగర్ భరణి రోడ్డు నాగమ్మై అడిగళార్ పాఠశాల, షోలింగనల్లూర్ మండలం పరిధిలో 197వ వార్డు పనయూర్ కుడిమియాండి తోపు సమీపంలోని సునామీ కట్ట పాఠశాల తదితర 11 ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

ప్రారంభోత్సవానికి సిద్ధంగా నోలంబూరు- మధురవాయల్ ఫ్లైఓవర్


నోలంబూరు వద్ద నిర్మించిన వంతెన

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మధురవాయల్ సమీపం నోలంబూరులో నివసిస్తున్న ప్రజల రవాణా ఇబ్బందులు తొలగేలా నోలంబూరు - మధురవాయల్ మధ్య కూవం కాల్వపై నిర్మించిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. ఈ ఫ్లైఓవర్‌ను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి వచ్చేవారం ప్రారంభించనున్నారని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు ప్రకటించారు. రూ.31.65 కోట్లతో 120 మీటర్ల పొడవునా కూవం కాల్వపై ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు గత యేడాది ప్రారంభమయ్యాయి. ఈ ఫ్లైఓవర్ నోలంబూరు, మధువాయల్, నెర్‌కుండ్రం, అంబత్తూరు, పాడి, ముగప్పేర్, అయ్యపాక్కం, తిరువేర్కాడు నడుమ రాకపోకలు సులభతరమవుతాయి.

ప్రజా గ్రీవెన్స్‌లో 15 వినతులు

పెరంబూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో కమిషనర్ అరుణ్ పాల్గొని, ప్రజల నుంచి 15 వినతిపత్రాలు స్వీకరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సమస్యలపై విచారించి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత స్టేషన్ అధికారులను ఆదేశించారు. ప్రతి బుధవారం జరిగే ఈ గ్రీవెన్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని నగర పోలీసు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ అరుణ్

శ్రీవారి సేవలో ప్రముఖులు




మణీందర్‌జీత్ బిట్టా - భూపిందర్ సింగ్ హుడా

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఆలిండియా యాంటీ టెర్రరిస్ట్ ఫ్రంట్(ఏఐఏటీఎఫ్) ఛైర్మన్ మణిందర్‌జిత్ బిట్టా, హర్యానా మాజీ సీఎం భూపిండ్ సింగ్ హుడా ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గోవిందుడి ఆలయంలో పవిత్ర ప్రతిష్ఠ




స్వామి ఉత్సవ విగ్రహానికి విశేష అభిషేకాలు చేస్తున్న అర్చకులు

గోవిందరాజస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం పవిత్ర ప్రతిష్ఠ ఆగమోక్తంగా జరిగింది. ఉదయం యాగశాలలో ఆకల్మష ప్రాయశ్చిత్తం, పంచ గవ్య ప్రాసన చేశారు. అనంతరం కల్యాణ మండపంలో గోవిందరాజస్వామి ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. కర్పూర హారతులు సమర్పించారు. తర్వాత శాత్తుమొర, ఆస్థానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. రాత్రి యాగశాలలో పలు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్, చిన్న జీయర్లు, టీటీడీ డిప్యూటీ ఈవో విఆర్.శాంతి, ఏఈవో ఏబీనారాయణచౌదరి, సూపరింటెండెంట్, ఆలయ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 7 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.90 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,925

తలనీలాలు సమర్పించినవారు: 21,338

'పట్టు' సాధించిన మగువలు

● పట్టు చీరల నేతలో నైపుణ్యం



మగ్గంపై చీర నేస్తున్న కార్మికురాలు

భాకరాపేట, ఆంధ్రజ్యోతి

చేనేత ..దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న రంగాల్లో ఇదొకటి.. ఆధునిక మరమగ్గాల ప్రవేశంలో ఎంతోమంది కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. కానీ చినగొట్టిగల్లు మండలంలో మూడు గ్రామాల్లో ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడి మహిళలకు అదే రంగం ఆసరాగా నిలుస్తోంది. వీరి నైపుణ్యప్రతిభకు పట్టం కడుతోంది. తొగటపల్లె, రంగన్నగారిగడ్డ, నల్లఓబులవారిపల్లె గ్రామాలలో తరుణీమణులే చేనేత మగ్గాలతో పట్టు వస్త్రాలను నేస్తూ సత్తా చాటుతున్నారు. మరమగ్గాలకు పోటీగా వీరంతా ధైర్యంగా నిలదొక్కుకున్నారు. కూటమి ప్రభుత్వమిచ్చిన ప్రోత్సాహకాలతో అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. పనిలో కొత్తదనానికి ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. పురుషులకు దీటుగా మెళకువలు నేర్చుకుని నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. సుమారు 200 కుటుంబాలు చేనేత పనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సమీపంలోని వస్త్ర దుకాణాల వారు వీరి నుంచి పట్టు ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నారు. మరోపక్క చేనేత సహకార సంఘం కూడా మార్కెటింగ్ పాత్ర పోషిస్తోంది. వీరిలో కొందరిని పలుకరిస్తే...

20 ఏళ్లుగా ఇదే ఆధారం



20 ఏళ్లుగా మగ్గం నేస్తున్నాను. వేల రకాల చీరలు నేశాను, మరగ్గాలపై వచ్చే చీరలకు దీటుగామంచి డిజైన్లతో నాణ్యమైన చీరలను నేస్తున్నాను. నెలకు సుమారు రూ.10 వేల వరకు సంపాదిస్తున్నాను. కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నారు. నా భర్త కూడా ఇదే పని చేస్తున్నారు. మా ఇద్దరు అమ్మాయిలను చదివించుకుంటున్నాం.

- రోజా రమణి, నేత కార్మికురాలు, తొగటపల్లె

కుటుంబానికి ఆసరా



నేను నా భర్తతో కలిసి నేత పని చేస్తున్నాను. కుటుంబ అవసరాలకు తోడ్పడుతున్నాను. సంఘంలో రుణాలు తీసుకుని పిల్లలను చదివించుకుని పిల్లల పెళ్లిళ్ల చేశాము. ఇల్లు కట్టుకున్నాం. ఇప్పుడు నేత ఆదాయంతో రుణాలను తీర్చుకుంటున్నాం.

- కుమారి, నేత కార్మికులరా, తొగటపల్లె

మగ్గమే ఆధారం



17 ఏళ్లుగా నేత పని చేస్తున్నాను. భర్త లేరు. ఇద్దరు పిల్లలనూ నేత పనితోనే పోషించుకుంటున్నాను. వారిని చదివించుకుంటున్నాను. తీసుకున్న రుణాలు ఎప్పటికప్పుడు తీర్చుకుంటున్నాను. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాను.

- సత్య, నేత కార్మికురాలు, రంగన్నగారిగడ్డ



చేనేత మగ్గం

శ్రీవారి సేవలో నటుడు శ్రీకాంత్

తిరుమల, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు శ్రీకాంత్ బుధవారం సుప్రభాతసేవలో పాల్గొన్నారు. సతీమణి ఊహ, కుమారుడు, హీరో రోషన్‌తో కలిసి బుధవారం వేకువజాము ఆలయంలో జరిగిన సుప్రభాతసేవలో పాల్గొని గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. వీరికి ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు శ్రీకాంత్ కుటుంబానికి పలువురు భక్తులు ఆసక్తిగా చూశారు. కొందరు వారితో సెల్ఫీలు దిగారు.



అతిథిగృహంలో కుటుంబ సభ్యులతో శ్రీకాంత్

భక్తులు మెచ్చేలా పోలేరమ్మ జాతర: కురుగొండ్ల



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ విష్ణువర్ధన్ రాజు తదితరులు

వెంకటగిరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరను భక్తులు మెచ్చేలా నిర్వహిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని పింజల వీరయ్య కల్యాణ మండపంలో జాతర నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలన్నారు. జాతరకు వచ్చే ప్రతి ఒక్కరూ అమ్మవారిని సులభంగా దర్శించుకొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ సారి వీఐపీ పాసులు కేవలం ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలకు మాత్రమే అందజేస్తామని స్పష్టం చేశారు. సామాన్య భక్తులు ఇబ్బంది పడకుడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.40 లక్షలు విడుదలైనట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని అమ్మవారి జాతరను విజయ వంతం చేయాలని కోరారు. జాతర నిర్వహణ ఏర్పాట్లపై గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని చెప్పారు. జాతర రోజే రూ.1.60 కోట్లతో పోలేరమ్మ ఆలయ కమర్షియల్ కాంప్లెక్స్, కల్యాణ మండపం నిర్మాణాలకు భూమిపూజ ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ విష్ణువర్ధన్ రాజు మాట్లాడుతూ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బృందాలను రప్పిస్తున్నట్లు తెలిపారు. చోరీల నియంత్రణ కోసం డోన్ కెమెరాలతో పర్యవేణ ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించేందుకు మఫ్టీలో ప్రత్యేక సిబ్బందితో నిఘా ఉంచుతామన్నారు. అనంతరం జాతరకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గూడూరు డీఎస్పీ గీతా కుమారి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పోలేరమ్మ దేవస్థానం ఛైర్మన్ గొల్లగుంట మురళి, ఎంపీపీ తనూజా రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాధ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని వేధించిన యువకుడిపై కేసు

చిట్టమూరు, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థినిని వేధించడంతో పాటు దాడికి పాల్పడిన యువకుడిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక పదో తరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన రాజీవ్ అనే యువకుడు తనను ప్రేమించాలంటే ఏడాది నుంచి బాలికను వేధిస్తున్నాడు. బాలిక బంధువులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ రాజీవ్‌లో మార్పు రాలేదు. మంగళవారం సాయంత్రం తరగతులు పూర్తయ్యాక తోటి విద్యార్థులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో ఉండగా రాజీవ్ మోటార్ బైక్‌పై వచ్చి తన ప్రేమను అంగీకరించాలని బాలికపై దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఇంటికి వెళ్తుండగా తన అన్న ప్రేమను అంగీకరించాలంటూ రాజీవ్ సోదరి కూడా బాలికపై దాడి చేసింది. బుధవారం బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా పనిచేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, అసహాయుల సంక్షేమానికి సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గ్రీన్ క్లైమెట్ ఫండ్(జీసీఎఫ్) జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల అభయారణ్యం, పరిసర గ్రామాల్లో సాగు, జీవనోపాధి సంబంధిత కార్యకలాపాలపై సుదీర్ఘంగా సమీక్షించారు.వాటర్‌షెడ్ కార్యక్రమాలు స్థానిక ప్రజలకు లాభదాయకమవుతాయని తెలిపారు. ముఖ్యంగా సముద్ర శైవల సాగు, మత్స్య ఉత్పత్తులతో వలన మత్స్యకారుల ఆదాయం పెరిగే అవకాశముంటుందని, దానిపై అధికారులు దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, అధికారులు సెల్వం, జయంతి, హారిక, మహ్మద్ రఫీ, సాముయేలు, జశ్వంత్, శోభన్‌బాబు, శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

ఉడ్ ప్లాంటేషన్‌తో లాభాలు పొందవచ్చు



రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీపీఎఫ్ ప్రసంగిస్తున్న సెల్వం

మంగళం, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): టింబర్ వుడ్ ఆధారిత ప్లాంటేషన్ ద్వారా రైతులు లాభాలు పొందవచ్చని సీసీఎఫ్ సెల్వం తెలిపారు. తిరుపతిలోని బయోట్రిమ్ కార్యాలయంలో బుధవారం రైతులకు బెంగళూరుకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, అటవీశాఖ సంయుక్తంగా వెదురు, శ్రీగంధం, ఎర్రచందనం మొక్కల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తిరుపతి పరిసర ప్రాంతాల నుంచి 70మంది రైతులు హాజరయ్యారు. టింబర్ వుడ్ ప్లాంటేషన్ ద్వారా కలిగే లాభాలు, మొక్కలను ఎలా పెంచాలి, వాటని ఎలా విక్రయించాలి అనే అంశాలపై శిక్షణ కల్పించారు. సీసీఎఫ్ సెల్వం మాట్లాడుతూ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే రైతులు ఎర్రచందనం మొక్కలను పెంచుతున్నారన్నారు. అయితే అంతర్జాతీయ డిమాండ్‌కు తగ్గట్టుగా రేటు రాకపోవడమో, ఇతర కారణాల వల్లో రైతులు ఎర్రచందనం పెంచడం తగ్గిందన్నారు. బయోట్రిమ్ స్టేట్ సెల్వి కల్చరిస్టు నరేన్ ధిరన్ మాట్లాడుతూ ఎర్రచందనానికి ఇతర టింబర్ వుడ్‌ట్రీ కన్నా ఆదాయం ఎక్కువ వస్తుందన్నారు. రైతులు వుడ్ ప్లాంటేషన్ చేపడితే తిరుపతి జిల్లా నుంచి కూడా సరఫరా చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చరల్ అధికారి దశరథ రామిరెడ్డి, అధికారులు పవన్ కుమార్, నాగభూషణం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సైంటిస్టులు నరసింహమూర్తి, ఎంవీ దొరై పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో పవిత్రోత్సవాలు



భరద్వాజ మహర్షి, శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లకు అభిషేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): దక్షిణ కైలాసంగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం పవిత్రోత్సవాలు ఆగమోక్తంగా ప్రారంభమయ్యాయి. నిత్యపూజల్లో జరిగే దోషాలను నివారించి మూలవిరాట్లకు పునరుత్తేజం తెచ్చే విధంగా ఈ పూజలను నిర్వహిస్తుంటారు. ఐదురోజుల పాటు జరిగే పూజల్లో తొలిరోజు బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో దక్షిణామూర్తి వద్ద శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లు, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువుతీర్చి విశేష అభిషేకాలు చేపట్టారు. పూర్ణహారతులు సమర్పించారు. అనంతరం భరద్వాజ మహర్షి, శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లను పట్టణంలో ఊరేగించారు. భక్తులు దర్శించుకున్నారు.

పంచాయతీలకు ఆర్థిక సంఘ నిధుల విడుదల

● రేణిగుంటకు అత్యధికంగా రూ.43లక్షలు

● డీపీవో సుశీలాదేవి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికలు జరిగిన 745 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. 2024-25 సంవత్సరానికి సంబంధించి రెండు విడతల్లో రూ.63.62కోట్ల మేర విడుదలయినట్లు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి సుశీలాదేవి తెలిపారు. తమ కార్యాలయంలో ఆమె బుధవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఈ నిధులను ప్రభుత్వం నేరుగా గ్రామ పంచాయతీ బ్యాంకు ఖాతాలకు జమ చేసిందని తెలిపారు. మొదట టైడ్ గ్రాంట్‌గా రూ.18.24కోట్లు, అన్‌టైడ్ కింద రూ.12.03కోట్లు వచ్చాయన్నారు.రెండవ విడత టైడ్ గ్రాంట్‌గా రూ.20కోట్లు, అన్‌టైడ్ కింద రూ.13.33 కోట్లు విడుదలయ్యాయని చెప్పారు. ఈమొత్తం నిధులను పంచాయతీల అభివృద్ధికి వినియోగించనున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలో అత్యధికంగా రేణిగుంట పంచాయతీకి రూ.43.03లక్షలు, అత్యల్పంగా పిచ్చాటూరు మండలం అప్పలరాజుకండ్రిగ గ్రామపంచాయతీకి రూ.53.582 జమ అయిందన్నారు. టైడ్ గ్రాంట్ కింద 50శాతం పారిశుధ్యం, మరో 50శాతం తాగునీరు, వర్షపునీటి నిల్వ,పంచాయతీల అభివృద్ధి కార్యక్రమానికి వినియోగిస్తున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేస్తే పంచాయతీకార్యదర్శులపై కఠిన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు.

సీఐ శ్రీనివాసులుకు డీఎస్పీగా పదోన్నతి



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బీవీ శ్రీనివాసులుకు డీఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది మంది సీఐలకు ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఇందులో జిల్లా పరిధిలో 29 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో పనిచేసిన శ్రీనివాసులుకు పదోన్నతి లభించింది. ఈయన 1995లో పోలీసు శాఖలో ఎస్ఐగా విధుల్లో చేరారు. మొదటిసారిగా ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని నింద్ర, వరదయ్యపాళెం, నాగలాపురం, మదనపల్లె, సత్యవేడు, ఎర్రావారిపాళెం, కలికిరి ప్రాంతాల్లో పనిచేశారు. 2011లో సీఐగా పదోన్నతి లభించింది. అక్కడి నుంచి పీటీసీలో మూడేళ్ల పనిచేశారు. అనంతరం అలిపిరి, మహిళా పోలీసుస్టేషన్, సత్యవేడు, చంద్రగిరి, తిరుపతి క్రైంలో పనిచేసి శ్రీసిటికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం డీఎస్పీగా పదోన్నతి లభించింది.

నిబద్ధత, అంకితభావంతో పనిచేయండి

● బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతిగృహాల్లోని పేద విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించడానికి బీసీ వెల్ఫేర్ అధికారులు నిబద్ధత, అంకితభావంతో పనిచేయాలని ఆ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సత్యనారాయణ కోరారు. తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో బుధవారం రాయలసీమలోని జిల్లాలకు సంబంధించిన వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారులు, సహాయ సంక్షేమ అధికారులకు సెన్స్‌టైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆ శాఖ ఎక్స్‌అఫిషియో కార్యదర్శి సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ బీసీ వెల్ఫేర్ అధికారులు వసతిగృహ విద్యార్థుల సంక్షేమం, వారి విద్యాభివృద్ధికి పాటుపడాలన్నారు. బీసీ సంక్షేమ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ వసతిగృహాల్లో ట్యూటర్లను నియమించి ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. మెను తప్పకుండా అమలుచేయాలన్నారు. సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజు మాట్లాడుతూ వారం వారం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, మంచి ఫలితాలు సాధించాలని ఆదేశించారు.



సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యం

7న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నీ

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో ఈనెల7 రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి పి.బాలసుబ్రమణ్యం తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ బాలబాలికలకు అండర్-11, 13, 15 విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 280 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. స్థానికంగా 25 మంది ఇప్పటికే ఈ టేబుల్ టెన్నిస్ ప్రాక్టీస్ చేస్తున్నారన్నారు. అటువంటి క్రీడాకారులను ఈ టోర్నమెంటు ద్వారా ప్రోత్సాహం అందించినట్లు అవుతుందని చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు రవిచంద్ర, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గరుడ వారధిపై డివైడరును ఢీకొన్న బైకు

● ఇద్దరికి బలమైన గాయాలు



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం లక్ష్మీపురం సర్కిల్ వద్ద గరుడ వారధిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతి కొర్లగుంటకు చెందిన రోహిణీకుమార్, అతడి స్నేహితుడు పి. రాజశేఖర్ తిరుచానూరు వైపు నుంచి గరుడ వారధిపై తిరుపతికి ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. మద్యం మత్తులో వేగంగా వాహనం నడిపి లక్ష్మీపురం సర్కిల్ వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్నారు. వీరి తలకు బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఈ ప్రమాదాన్ని గుర్తించిన కొందరు వాహనదారులు ఈస్ట్ పోలీసులకు సమాచారం అందించారు. రక్షక్ ఏఎస్ఐ అశోక్ ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. రోహిణీకుమార్‌కు వెంటిలేటర్‌పై.. పి.రాజశేఖర్‌కు ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కాగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా వారి వివరాలు తెలుసుకోవడంలో ఈస్ట్ పోలీసులు సరిగా స్పందించలేదన్న ఆరోపణలున్నాయి. జరిగిన ఘటనపై రక్షక్ ఏఎస్ఐని సంప్రదించినా తమకేమి తెలియదని చెప్పడం గమనార్హం.

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10.11 లక్షల విరాళం



అదనపు ఈవోకు డీడీ అందజేస్తున్న దాత

తిరుమల, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10.11 లక్షలు విరాళంగా అందింది. గుంటూరుకు చెందిన ఆలపాటి సురేష్ ఈ విరాళాన్ని ఇచ్చారు. తిరుమలలో బుధవారం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి దాత విరాళం డీడీని అందజేశారు.

మెడికల్ షాపులపై దాడులు

● బిల్లుల్లేని 18 రకాల మందుల గుర్తింపు



మందులను పరిశీలిస్తున్న అధికారులు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని తిరుచానూరు పద్మావతి ఇంటిగ్రేటెడ్ పాలి హాస్పిటల్లోని శ్రీపద్మావతి మందుల దుకాణంలో నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయిస్తున్నారనే సమాచారం రావడంతో డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో తిరుపతి, చిత్తూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు బుధవారం రాత్రి దాడులు చేశారు. అబార్షన్‌కు ఉపయోగించే 10 రకాలు, నార్కోటిక్స్(ఎన్ఆర్ఎక్స్), బిల్లులు లేకుండా విక్రయిస్తున్న 18 రకాల మందులను గుర్తించారు. వీటిని తిరుపతిలోని పలు మందుల ఏజన్సీల నుంచి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. అలాగే పలు ఏజన్సీలకు సంబంధించి 15 ఇన్వాయిస్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆస్పత్రిలోని హోమియోపతి వైద్యురాలు డాక్టర్ ఎం.శైలజ రోగులకు అనధికారికంగా అబార్షన్ మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేసి, చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ దాడుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రీతు పాల్గొన్నారు.